క్లుప్తంగా

'బ్రౌన్'కు 500 పుస్తకాల అందజేత



పుస్తకాలను అందజేస్తున్న కన్నయ్యనాయుడు, సరస్వతి దంపతులు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి మరో 500 పుస్తకాలు చేరాయి. తిరుపతికి చెందిన ప్రొఫెసర్, రచయిత డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడు తన సతీమణి సరస్వతితో కలసి శనివారం తన స్వగృహంలో 500 పుస్తకాలను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్ వీటిని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడు అందించిన పుస్తకాలు ఎంతో ప్రాచుర్యం సాధించినవేనని తెలిపారు.

ఘన సన్మానం



రాజశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి సేవలు ప్రశంసనీయమని ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ కొనియాడారు. విశ్వవిద్యాలయానికి 2022 జూన్ 18వ తేదీన డిప్యూటేషన్‌పై వచ్చిన డీఈ రాజశేఖర్ రెడ్డి తన మాతృసంస్థ నీటిపారుదల శాఖకు వెళుతున్న సందర్భంగా విశ్వవిద్యాలయం తరఫున శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి రెండేళ్ల కాలంలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశారన్నారు. విశ్వవిద్యాలయానికి న్యాప్–ఏ గ్రేడ్ సందర్భంగా రహదారులు, నూతన పరిపాలనా భవనం వినియోగానికి అనుగుణంగా మార్పులు, సేనెట్ హాల్ అందుబాటులోకి తీసుకురావడం, వసతి గృహాలు, గెస్ట్ హౌస్ ఆధునికీకరణ పనులు చేసి ప్రగతికి తోడ్పడ్డారన్నారు. విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వంటి నిర్మాణాలు ఆకర్షణీయంగా తయారు చేయించారని రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీకి వినతి

కడప ఎడ్యుకేషన్ : రూ. లక్షల్లో విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్న నారాయణ, చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ యూనియన్ కడప జిల్లా అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డీఈఓ కార్యాలయ ఏడీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.


అన్నదానం



అన్నదానం చేస్తున్న మాకం అశోక్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన పీసీసీ మాజీ అధ్యక్షులు మాకం అశోక్‌కుమార్ నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం నిర్వహించారు. తన తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు అట్లూరి బాల సుబ్బయ్య, మేనేజర్ సుధారాణి, భాను ప్రసాద్, సురేష్ బాబు, శివకుమార్, దామోదర్‌రెడ్డి, సాయి రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉపాధి అవకాశాలు



వీడ్కోలు సభలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : ఫార్మసీ విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఆరు సంవత్సరాల ఫార్మ్–డీ విద్యను అభ్యసించి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్య రంగంలో ఫార్మసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ స్వర్ణలత, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు ద్వారకనాథరెడ్డి. డా.గిరిరాజశేఖర్, డా.ఎం.శిరీషా, డా.ఎం.ప్రమోద్, డా.మణిదీప్, వినీల, హాసినీలతోపాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

- భక్తిశ్రద్ధలతో పూజలు
- ఘనంగా హనుమజ్జయంతి



తామర పూల గింజలతో హనుమంతునికి అలంకారం



గడ్డిబజారు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష అలంకారం



కో ఆపరేటివ్ కాలనీలోని ఆలయంలో విశేష అలంకారంలో హనుమంతుడు



హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కల్చరల్ : స్వామి భక్తి, కార్యదక్షత, అమేయ శక్తిసంపదలకు ప్రతిరూపమైన పవన కుమారుడు హనుమంతుడికి హనుమజ్జయంతి సందర్భంగా శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కడప నగరంలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలలో ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకారం నిర్వహించారు. పలు ఆలయాలలో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు సమర్పించిన వడలను మాలలుగా స్వామికి అలంకరించారు. మరికొన్నిచోట్ల భక్తులు స్వామికి ఆకుపూజ, కుంకుమపూజ, సింధూర పూజలను నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. దాదాపు అన్ని అంజనేయస్వామి ఆలయాలకు వెలుపల భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కొన్ని ఆలయాల వద్ద ఉదయం, సాయంత్రం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, గణపతిపూజ, మన్యసూక్తహోమం, కలశ స్థాపన, దీపోత్సవం తదితర పూజలు చేశారు. కొన్నిచోట్ల పలు రంగుల ముత్యాలతో, మరి కొన్నిచోట్ల నాగవల్లీ దళాలు (తమలపాకులు) తదితరాలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తబృందాలు భజనలు నిర్వహించారు. మరికొన్నిచోట్ల ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

కడపలో విశేష అలంకారాలు

స్థానిక చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి ఆకుపూజ, వడమాలసేవ తదితర విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయం పునర్నిర్మాణంలో ఉండడంతో బాల ఆలయంలో ఈ పూజోత్సవాలు నిర్వహించారు.

నగరంలోని గడ్డిబజారులోగల శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ అభయాంజనేయస్వామికి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశేష అలంకారం, పూజలు నిర్వహించారు.

స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని ఆలయంలో హనుమత్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత బస్టాండువద్దగల శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 5.00 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. అభిషేకం, అలంకారం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. భక్తుల బృందాలు ఆలయం పక్కనే ఏర్పాటు చేసిన వేదికపై మధ్యాహ్నం వరకు భజనలు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం చేశారు. కడప నగరంలోని దాదాపు 50కి పైగా ఆలయాలలో ఆంజనేయునికి హనుమజ్జయంతి విశేష పూజలు చేశారు.

హనుమాన్ జయంతి పూజలలో మేయర్

కడప కార్పొరేషన్ : హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక శంకరాపురంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మేయర్ కె. సురేష్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనతో పూజలు నిర్వహింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాణా ప్రతాప్, శంకరాపురం సింధు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి



హనుమంతునికి తమలపాకుల అభిషేకం



హనుమంతుని ఊరేగింపులో అమ్మవారిశాల నిర్వాహకులు

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దల పర్యవేక్షణలో స్వామికి పలు రకాల పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళా భక్తబృందం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజ నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు బెస్తవేముల రామమహేష్ ఈ సందర్భంగా హనుమద్ వైభవం గురించి ఉపన్యసించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు, భక్తులు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్‌ల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప వై జంక్షన్‌లో ఉన్న ఆర్ఎస్‌యూ కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాంకులను ప్రకటించుకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, ఆర్ఎస్‌యూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, కడప నగర అధ్యక్షుడు హరిబాబు, బలరాంరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వాన



ఆర్టీసీ ఔట్ గేట్ సమీపంలో రోడ్డుపై నిలిచిన డ్రైనేజీనీరు



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం పక్కన రోడ్డుపైకి వచ్చిన డ్రైనేజీ నీరు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది.

పగలంతా ఎండవేడిమి, ఉక్కపోతతో ఉన్న వాతారణం సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై వర్షించింది. వాన కొద్దిసేపు కురిసినా ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద నాగార్జున మోడల్ స్కూల్‌కు పోయే మార్గంలో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఆర్టీసీ ఔట్ గేట్ పక్కన ఉన్న ఖజానా జ్యువెలర్స్ ఎదురుగా, ఆర్టీసీ బస్టాండులో వర్షపునీరు నిలిచి ప్రయాణీకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలులు వల్ల చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ లైన్లు తెగిపోయాయి.

అరటి పంటపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త సుశీల

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో అరటి పంట సాగుచేసే రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల, శాస్త్రవేత్తలు నాగేంద్రారెడ్డి, సునీల్‌కుమార్‌లు రెండు రోజులుగా పెద్దరంగాపురం, పులివెందుల, నల్లపురెడ్డిపల్లె, వేముల, బెస్తవారిపల్లె గ్రామాల్లో ఉద్యాన రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అందులో భాగంగా వేల్పుల రైతు భరోసా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో విద్యార్థులు వ్యవసాయంలో నూతన పద్ధతులపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రైతులు అడిగిన వివిధ సమస్యలకు శాస్త్రవేత్తలు సమాధానాలు సూచించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ప్రకృతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగిరెడ్డి, నల్లపురెడ్డిపల్లె వీహెచ్ఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నియంత్రణ మనందరి బాధ్యత



క్యాన్సర్ నియంత్రణ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

పులివెందుల రూరల్ : క్యాన్సర్ నియంత్రణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం మెడికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కడప సర్వజన ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్యులకు రెండురోజుల పాటు క్యాన్సర్ నియంత్రణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జనాభా లెక్కల ప్రకారం 2022లో భారతదేశంలో కొత్తగా క్యాన్సర్ కేసుల సంఖ్య 14.61లక్షలపై చిలుకు ఉండేదన్నారు. సుమారు 10 లక్షల వరకు మృతి చెందడం జరిగిందన్నారు. ప్రస్తుతం 38 లక్షల మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయన్నారు. భారతదేశ వ్యాప్తంగా ప్రతి 9 మందిలో ఒకరు క్యాన్సర్ బారినపడుతున్నారన్నారు. ముఖ్యంగా పురుషులలో ఊపిరితిత్తుల క్యాన్సర్, గర్భాశయం, రొమ్ము, నోటి క్యాన్సర్‌లు మహిళలు అగ్రస్థానంలో ఉందన్నారు. 2020తో పోలిస్తే 2025 నాటికి 128 శాతం క్యాన్సర్ పెరుగుతుందని అంచనా వేయబడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులకు క్యాన్సర్‌పై శిక్షణ ఎంతో ఉపయోగకరమన్నారు. శిక్షణ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అనుమానంగా ఉన్న రోగులకు ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించేలా వైద్య బృందం చర్యలు తీసుకోవాలన్నారు. కలిసికట్టుగా క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు మనవంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ ముందస్తు విభాగం నోడల్ అధికారి జీవనప్రియ, ఇన్‌చార్జి నోడల్ అధికారి కేశవకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యక్రమాలు విద్యార్థుల జీవితాలకు మలుపు



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్య అతిథులు, శాస్త్రవేత్తలు

మైదుకూరు : గ్రామీణ వ్యవసాయ అనుభవ పని కార్యక్రమాలు విద్యార్థుల జీవితాల్లో గొప్ప మలుపుగా చెప్పవచ్చని మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం విద్యార్థులు పని అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం కీటక విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.రామయ్య, కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పోరుమామిళ్ల ఉద్యాన అధికారి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమాలు (ఆర్ఏడబ్ల్యూఈపీ) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వలన పంట యాజమాన్య విధానాలు, రైతుల సాధక బాధకాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం వారికి కలుగుతుందని తెలిపారు. సదస్సులో మట్టి నమూనా పరీక్షల గురించి, వాటి ప్రాముఖ్యత, పోషకాల ఆవశ్యకత గురించి వివరించారు. సేంద్రీయ వ్యవసాయం ఉపయోగాలను మిరప, అరటి, పసుపులో వచ్చే కీటకాలు, తెగుళ్ల వాటి నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీప్తికిరణ్, కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు చేసిన కార్యక్రమాలు, ప్రదర్శనల గురించి వృత్తి విద్యా శిక్షణ తరగతులు, రైతులతో చేసిన కార్యక్రమాలను వివరించారు.

బీటెక్ రవి..చీకటి ఒప్పందాలు నీకే అవసరం

నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్

పులివెందుల రూరల్ : బీటెక్ రవి.. చీకటి ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం వైఎస్ కుటుంబీకులకు లేదని అవి నీకే అవసరమని నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాకు మీరు.. మీకు మేము అని చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు జరిగిన 20 రోజుల తర్వాత లేనిపోని మాటలు చెప్పి వైఎస్ కుటుంబంపై బురదచల్లే మాటలు మానుకోవాలన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 7 నియోజకవర్గాల్లో ప్రచారం చేసి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారే తప్పా తనను గెలిపించాలని ఎప్పుడూ కూడా ప్రచారం చేయలేదన్నారు. 4న వచ్చే ఫలితాలను చూసి టీడీపీ నాయకులకు భారీ షాక్ తగిలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలఅశ్వర్థరెడ్డి, రాజశేఖర్, ప్రదీప్‌రెడ్డి, బాషా, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు వైఎస్ అవినాష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం

ఖాజీపేట : ప్రజా నాయకుడు ఎంపీ అవినాష్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటే అవినాష్‌రెడ్డికే ప్రజలు అండగా నిలబడ్డారని తెలిపారు. కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు డిపాజిట్ కూడా దక్కదని ఎద్దేవాచేశారు. కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని బలిపశువును చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమావ్యక్తం చేశారు. టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పబోతున్నారని జోస్యం చెప్పారు.

ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : యూరియా తదితర ఎరువులన్నీ ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పు రుగు మందులు విక్రయించే డీలర్లతో సమీక్షా స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా తదితర ఎరువులన్నీ ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల చ ట్టంకు లోబడి వ్యాపారం చేయాలని స్పష్టం చేశా రు. అలాగే స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డు అందరూ షాపులోనే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే స్టాక్ రిజిష్టర్‌కు, ఎరువుల నిల్వలకు తేడా లేకుండా చూసుకోవాలన్నారు. పురుగు మందుల డీలర్లు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. నిషేధించబడిన పురుగు మందులు విక్రయించరాదన్నారు. మండల ఏఓ సరస్వతి, కమలాపురం, ఎర్రగుంట్ల, వల్లూరు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు నిత్యం అందుబాటులో ఉండండి



రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాలను శనివారం బద్వేల్‌లో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. అంతేగాకుండా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి తక్షణమే ఇండెంట్ పెట్టాల్సిందిగా సిబ్బందికి సూచించామన్నారు. పలు రకాల రిజిస్టర్లను అప్‌డేట్ చెయ్యాలన్నారు. బొగ్గిడివారిపల్లెలో వరి పీబీటీ 5204 మూల విత్తనం పంపిణీ చేయాల్సిందిగా రైతులు అడగడం జరిగిందన్నారు. కనీసం రెండు యూనిట్లు అవసరమని తెలిపారన్నారు. జీలుగ, జనుము విత్తనములను బద్వేల్ మార్కెట్ యార్డులోని సమీకృత నాణ్యత పరీక్ష కేంద్రంలో మొలకల శాతం నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. రైతులకు అను నిత్యము అందుబాటులో ఉంటూ అన్నీ రకాల సేవలను అందిస్తు రైతుల మన్నలను పొందాలన్నారు. రైతులు వాస్తవంగా వినయోగిస్తున్న మొబైల్ నెంబర్ సేకరించి నిర్దేశిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులను అన్ని విధాలా సమయాత్తం చేయాలని, క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, ముఖాముఖి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కలసపాడు : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖాధికారులు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం సందర్భంగా శనివారం మండలంలోని గంగాయపల్లె, ఈ–రామాపురం, ఈ–తంబళ్లపల్లె, రెడ్డిపల్లె, డి–తంబళ్లపల్లె, సింగరాయపల్లె, కలసపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, ఒత్తిడి లేని చదువు, కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ట్రిపుల్‌ఐటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.